సాక్షి
ఆదిలాబాద్

మంగళవారం । 23 । జనవరి । 2024

25న బైక్ ర్యాలీ

ఆదిలాబాద్: జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 25న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి జిల్లా క్రీడా సంఘాల బాధ్యులు, క్రీడా బోధకులు, క్రీడాకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు జిల్లాకు మంత్రి సీతక్క రాక

కైలాస్‌నగర్: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) మంగళవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాలోని అధికారులతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
29.0/16.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

మూడే అర్జీలు..!

- వెలవెలబోయిన ప్రజావాణి
- అర్జీదారుల కోసం అధికారుల నిరీక్షణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే గ్రీవెన్స్‌పై అయోధ్య రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట ప్రభావం పడింది. ప్రతీవారం అర్జీదారులతో కిటకిటలాడే సమావేశ మందిరం ఈసారి వెలవెలబోయింది. దరఖాస్తుదారుల కోసం అధికారులు నిరీక్షించాల్సి వచ్చింది. కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సహా జిల్లా స్థాయి అధికారులంతా హాజరయ్యారు. కేవలం మూడు అర్జీలు మాత్రమే అందాయి. దరఖాస్తుదారుల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని సంబంధిత అధికారులకు అందజేశారు. వెబ్‌సైట్‌లో నమోదుతో పాటు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేలా శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఇందులో జెడ్పీ సీఈవో గణపతి, ఆర్డీవో స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల సంక్షేమానికి నిధులు వినియోగించాలి

కైలాస్‌నగర్: ప్రభుత్వశాఖలు తమకు సర్కారు కేటాయించే నిధుల్లో ఏటా 16 శాతం విధిగా ఎస్సీల సంక్షేమానికి వినియోగించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూల్డు కులాల ప్రత్యేక అభివృద్ధి నిధి అమలుపై సోమవారం జిల్లాస్థాయి సమీక్ష నిర్వహించారు. గతేడాదిలో ఆయా శాఖలకు వచ్చిన నిధులు, అందులో ఎస్సీల సంక్షేమానికి వినియోగించిన నిధులపై శాఖల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖలు ఎస్సీల అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క జిల్లాలోని ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించనున్న సమావేశానికి అధికారులు తగు నివేదికలతో హాజరుకావాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, ఎస్సీ సంక్షేమ అధికారి సునీత కుమారి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలివ్వాలని ఆందోళన



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కైలాస్‌నగర్: పట్టణంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు ఇంటి పట్టాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పేదలతో కలిసి కార్యాలయం లోపలి ప్రధాన ద్వారం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలోని సర్వేనంబర్ 38లోని నిషాన్‌ఘాట్, 170లోని న్యూహౌసింగ్‌బోర్డులో వందలాది మంది నిరుపేదలు పదేళ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వారికి పట్టాలు ఇవ్వకపోగా కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదన్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి అర్హులైన వారికి పట్టాలు జారీ చేయడంతో పాటు తాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కుంటాల రాములు, రాష్ట్ర సమితి సభ్యురాలు ముడుపు నళిని రెడ్డి, షేక్ పాషా, అమీనాఖాన్, గణేశ్, పొచ్చిరాం, రాందాస్, సంగీత, రేఖ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ సాధన కోసం 24న జిల్లా బంద్

ఎదులాపురం: ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ సాధన కోసం చేస్తున్న ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రైల్వేలైన్ సాధన కమిటీ అధ్యక్షుడు కాశవేని నారాయణ యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సాధన కమిటీ సభ్యులతో కలిసి సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉద్యమంలో భాగంగా ఈనెల 24న జిల్లా బంద్ పాటించాలని అఖిలపక్ష సమావేశంలో తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. ఇందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. కమిటీ ప్రధాన కార్యదర్శి నరేందర్, వైస్ చైర్మన్ దత్తాత్రి, సభ్యులు దేవేందర్, అప్సర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జై శ్రీరామ్..




శోభాయాత్రలో శ్రీరాముని ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎంపీ, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు



మొక్కుతున్న యువతి



జిల్లా కేంద్రంలో శోభాయాత్రకు భారీగా హాజరైన యువత



శోభాయాత్రలో హనుమాన్ వేషధారణ సందడి



జిల్లా కేంద్రంలోని గోపాలకృష్ణ మఠంలో కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు



వెలుగులు విరజిమ్మేలా..: సెల్‌ఫోన్ టార్చ్ లైట్లతో భక్తులు..



నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే బాపూరావు

సకలం రామమయం.. సర్వం శ్రీరామజపం.. అంతటా అయోధ్య ఆధ్యాత్మిక పరిమళాలే.. ఎక్కడ చూసినా రఘువంశ తిలకుని ధ్వజాల రెపరెపలు.. సకలగుణాభిరాముని నినాదాలు.. ఆలయాల్లో భక్తుల బారులు.. కమనీయంగా కల్యాణ మహోత్సవాలు.. అంగరంగ వైభవంగా శోభాయాత్రలు.. చిన్నా పెద్ద తేడా లేకుండా ఎక్కడ చూసినా దశరథ నందనుని కీర్తనలే. ఇలా అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. నవమి వేడుకలను తలపించేలా భక్తిపారవశ్యం ఉప్పొంగింది.

- ఘనంగా బాలరాముని ప్రాణప్రతిష్ట వేడుకలు
- ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు
- నేత్రపర్వంగా కల్యాణోత్సవాలు, శోభాయాత్రలు

ఆదిలాబాద్: జిల్లా వ్యాప్తంగా శ్రీరామ జన్మభూమి అయోధ్యలో నిర్వహించిన బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన మహోత్సవాలను సోమవారం కన్నుల పండువగా జరుపుకున్నారు. ఉదయం నుంచే యువతులు ముంగిళ్లను రంగవల్లులతో సుందరంగా తీర్చిదిద్దారు. వేకువజాము నుంచే భక్తులు శ్రీరామ, హనుమ, శివాలయాలకు బారులు తీరారు. సీతారాములు, అంజనేయస్వామి, శివుడుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.జిల్లాకేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాల కృష్ణ మఠం, హౌసింగ్‌బోర్డ్ శ్రీరామాలయాల్లో కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగాయి. వీటిని వీక్షించేందుకు భక్త జనం భారీగా తరలివచ్చారు.ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్లలో ప్రాణ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలను వీక్షించారు. అన్నదానాలు జోరుగా సాగాయి.ఇంటింటా దీపాలు వెలిగించి, దీపావళి పండుగ జరుపుకున్నారు. ఉదయం సమయంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టగా, సాయంత్రం శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన శోభాయాత్ర పట్టణ వీధుల గుండా నేత్రపర్వంగా సాగింది. పల్లె, పట్టణమంతా శ్రీరామ నామస్మరణతో మారుమోగింది. ఎస్పీ గౌస్ ఆలం, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపూరావు, జోగు రామన్న, హిందూ సంఘాల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



ఓ వైపు అయోధ్య ప్రత్యక్ష ప్రసారం, మరోవైపు కల్యాణోత్సం వీక్షిస్తున్న భక్తులు

కట్టుదిట్టంగా బందోబస్తు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీనిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ గౌస్ ఆలం ప్రత్యేకబందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని కూడళ్లలో పోలీసులను మోహరింపజేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు పోలీసు మొబైల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. మధ్యాహ్న సమయంలో డీఎస్పీ పోతారం శ్రీనివాస్, వన్‌టౌన్, టూటౌన్ సీఐలతో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు.



జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీలో మహిళలు



పట్టణంలో పర్యటిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ధర ఉన్నా.. దిగుబడి లేదాయె!



భీంపూర్ మండలం అంతర్గాంకు చెందిన గుండ ప్రకాశ్ అనే రైతు వానాకాలంలో తన ఎనిమిది ఎకరాల పొలంలో సోయాబీన్‌లో అంతర్ పంటగా కంది సాగు చేశాడు. 28 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. గతేడాది ఇంతే సాగు చేయగా, సుమారు 40 క్వింటాళ్లు వచ్చింది. అప్పుడే దిగుబడి తగ్గిందనుకుంటే, ఈసారి మరింతగా తగ్గింది. మార్కెట్లో కందులకు మంచి ధర ఉన్నప్పటికీ దిగుబడి రాలేదన్న నిట్టూర్పు ఈ రైతును వెంటాడుతోంది. జిల్లాలో పలువురు కంది రైతులది ఇదే పరిస్థితి.



- కంది రైతులో నిట్టూర్పు
- చీడపీడల సమస్యతో తగ్గిన సాగు విస్తీర్ణం
- నేటి నుంచి కొనుగోళ్లు ప్రారంభం

కంది పంట వివరాలు..
సాగు విస్తీర్ణం : 60,818
దిగుబడి అంచనా: 3లక్షల 64వేల క్వింటాళ్లు
మద్దతు ధర : రూ.7వేలు (క్వింటాలు)
బహిరంగ మార్కెట్‌ధర:
రూ.9,141 (సోమవారం రోజు)

సాక్షి,ఆదిలాబాద్: ఎకరం విస్తీర్ణంలో అంతర్ పంటగా కంది సాగు చేస్తే ఆరు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ప్రస్తుతం కనీసం నాలుగు క్వింటాళ్లు కూడా రాని పరిస్థితి. చీడపీడల సమస్యలే కారణమని రైతులు చెబుతున్నారు. ఓ వైపు రసాయన మందుల వాడకం పెరగడంతో పెట్టుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. మరోవైపు దిగుబడి తగ్గడంతో రైతుల్లో నిట్టూర్పు కనిపిస్తుంది. గతేడాది చీడపీడల సమస్య కారణంగా ఈ సారి పంట సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. గతేడాది 65వేల ఎకరాలకు పైగా పంట సాగైతే, ఈ వానకాలంలో 60వేల ఎకరాలకే పరిమితమైంది.

నేటి నుంచి కొనుగోళ్లు..

జిల్లాలో కందుల కొనుగోళ్లు మంగళవారం నుంచి షురూ కానున్నాయి. ఆదిలాబాద్ మార్కెట్‌లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రారంభించనున్నారు. జిల్లాలో మార్క్‌ఫెడ్ ఎనిమిది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కందులను కొనుగోలు చేయనుంది. బహిరంగ మార్కెట్లో మద్దతుకు మించి ధర ఉండడంతో ప్రైవేట్ వ్యాపారులే అధికంగా కొనుగోలు చేసే పరిస్థితి ఉంది. మరోవైపు మార్క్‌ఫెడ్ తొలిసారి వాణిజ్య కొనుగోలు చేస్తుంది. బహిరంగ మార్కెట్లో సోమవారం క్వింటాలుకు రూ.9,141 ధర పలికింది. ఈ నేపథ్యంలో ఏరోజటి ధర ఆరోజు మార్కెట్లో ప్రకటించనున్నారు. ఇటీవల సూర్యపేట మార్కెట్‌లో క్వింటాలుకు రూ.9,500 వరకు ధర పలకడం గమనార్హం.

నేడు కొనుగోళ్లు ప్రారంభం

ఆదిలాబాద్ మార్కెట్‌లో మంగళవారం కొనుగోళ్లను ప్రారంభిస్తున్నాం. ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నాం. బుధవారం బేల, జైనథ్ మార్కెట్లలో మొదలుపెడతాం. తాంసి, ఇచ్చోడ, బోథ్, నార్నూర్, ఇంద్రవెల్లిలోనూ కొనుగోళ్లను చేపడతాం. మార్క్‌ఫెడ్ కూడా వాణిజ్య కొనుగోలు చేపడుతున్న దృష్ట్యా ఏరోజటి ధరను ఆరోజే ప్రకటిస్తాం.

– ప్రవీణ్‌రెడ్డి, డీఎం, మార్క్‌ఫెడ్, ఆదిలాబాద్

‘ఆ.. సారు’పై ఎందుకంత ప్రేమ?

- విమర్శలకు తావిస్తున్న విద్యాశాఖ తీరు
- జైలుకెళ్లినా సస్పెండ్ చేయని వైనం

ఆదిలాబాద్‌టౌన్: చిన్నపాటి తప్పిదాలకే కొరడా ఝులిపించే విద్యా శాఖ ఏకంగా జైలుకు వెళ్లిన ఓ ఉపాధ్యాయుడిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఫిర్యాదు అందితేనే ఉరుకులు పరుగుల మీద విచారణ చేపట్టి సస్పెండ్‌చేసే ఆ శాఖ సదరు ఉపాధ్యాయుడిపై ఎందుకంత ప్రేమ చూపుతున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. అధికారుల పక్షపాత వైఖరిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పక్షం క్రితం ఉట్నూర్‌లోని ఉర్దూ మీడియం పాఠశాలలో బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై ఆమె తల్లిదండ్రులు స్థానిక పోలీసు స్టేషన్ ఫిర్యాదు చేయగా, పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారంపాటు జైలు అనుభవించాడు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి 24 గంటలపాటు జైలులో ఉంటే సీసీఏ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఆ ఉపాధ్యాయుడిపై విచారణ చేపట్టకుండా నిమ్మకునీరెత్తినట్టుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. మండల విద్యాధికారి ఈ ఘటన జరిగిన రెండు మూడు రోజుల్లోనే విచారణ జరిపి డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు నివేదిక సమర్పించారు. ఆ శాఖ జిల్లా అధికారులు సంబంధిత పోలీసు స్టేషన్ నుంచి రిపోర్టు కాపీ తెప్పించుకొని సస్పెండ్ చేయాల్సి ఉంటుంది. అయితే ఆశాఖ ఉద్యోగులు ఒకరిపై ఒక రు నెట్టుకుంటూ ఈ వ్యవహారాన్ని పక్కన పెడుతున్నారు.

అధికారులపై ఒత్తిడే కారణమా..?

సదరు ఉపాధ్యాయుడు ఓ ఉపాధ్యాయ సంఘం లీడర్ బంధువు కావడంతో ఆయనపై చర్యలకు వెనుకాడుతున్నట్లు సమాచారం. ఆ లీడర్ రాజకీయ నాయకులతో విద్యాశాఖ అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. డీఈవో కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి ఎంఈఓ రిపోర్టు సరిగా లేదని చెబుతుండగా, ఎస్సై రిపోర్టు ఇవ్వకపోవడంతోనే ఆయనను సస్పెండ్‌చేయడం లేదని మరో ఉద్యోగి పేర్కొంటున్నారు. ఇలా మాకు సంబంధం లేదంటూ ఒకరిపై ఒకరు నెట్టివేస్తున్నారు. గతంలో ఆరోపణలు వచ్చిన వెంటనే రాత్రికి రాత్రే ఉత్తర్వులు జారీ చేస్తూ హడావుడి చేసే అధికారులు ఈవిషయంలో తాత్సారం చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై డీఈవో ప్రణీతను వివరణ కోరగా,మండల విద్యాధికారి నివేదిక సరిగా లేదని, త్వరలో ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తామని పేర్కొన్నారు.

అయోధ్య ట్రస్టుకు రూ.1,11,111 విరాళం

కైలాస్‌నగర్: అయోధ్య రామ జన్మభూమి తీర్థ క్షేత్రం ట్రస్ట్‌కు ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ తిరుమల ఫిల్లింగ్ స్టేషన్ యజమాని ముడుపు ప్రేమేందర్‌రెడ్డి రూ. 1,11,111 విరాళంగా ప్రకటించారు. ఈమేరకు చెక్కును సోమవా రం హిందూ వాహిని ఆల్ ఇండియా ప్రచారక్ దేవేందర్‌జీకి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, కుటుంబీకులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ప్రేమేందర్‌రెడ్డి

ముగ్గులో అయోధ్య మందిరం

చెన్నూర్: అలేఖ్య వేసిన ముగ్గు



ఆదిలాబాద్‌లోని శాంతినగర్‌కాలనీలో..



నిర్మల్ బోయవాడలో..



చెన్నూర్/మంచిర్యాలటౌన్/దండేపల్లి: అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా చెన్నూర్ పట్టణమంతా రామనామస్మరణతో మార్మోగింది. రాములోరిపై ఉన్న భక్తిని పలువురు వివిధ రూపాల్లో చాటుకున్నారు. పుప్పాల హనుమాన్ వీధిలో పుల్యాల అంజన్న కుమార్తె అలేఖ్య ఇంటి ముంగిట రాములోరి గుడిని ముగ్గు వేయగా అందరినీ ఆకట్టుకుంది. ఆదర్శనగర్ కాలనీకి చెందిన బొడ్డు కమల రాముని రూపాన్ని ముగ్గుతో అలంకరించి తన భక్తిని చాటుకున్నారు. మంచిర్యాల పట్టణంలోని చున్నంబట్టికి చెందిన కొండవీటి తిరుమల.. అయోధ్య రామమందిరం ముగ్గును వేసి ఆకట్టుకుంది. దండేపల్లి మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఇంటి వాకిళ్లలో కొందరు మహిళలు అయోధ్య రామమందిరం వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్ పోటీలకు ఎంపిక



విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్ట్‌తో ఉపాధ్యాయులు

కడెం: కడెంలోని జెడ్పీ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్ పోటీలకు ఎంపికయ్యారు. ఆన్‌లైన్ పద్ధతిన నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో రాంసాగర్, షాహిద్, సాత్విక తయారు చేసిన ప్రాజెక్ట్ 'న్యూ ఫార్మింగ్ సిస్టం ఇన్‌ఫారెస్ట్ ఏరియా' రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాలలో గైడ్ టీచర్ రఘురెడ్డి, విద్యార్థులను హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి సోమవారం అభినందించారు.

కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ

నర్సాపూర్(జి): నర్సాపూర్‌లోని కేజీబీవీ విద్యార్థినులు జి.అర్చన, సీహెచ్.సృజన కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈనెల 20, 21వ తేదీల్లో జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ లీగ్ పోటీల్లో జి.అర్చన లైట్ కాంటాక్ట్ 55 కిలోల విభాగంలో బంగారు, పాయింట్ ఫైట్ 55 కిలోల విభాగంలో వెండి, సీహెచ్.సృజన లైట్ కాంటాక్ట్ 70 కిలోల విభాగంలో కాంస్య, పాయింట్ ఫైట్ 70కిలోల విభాగంలో బంగారు పతకాలు సాధించారు. వీరిని కోచ్‌లు స్వామి, మృణాళిని, ఎస్వో సునీత అభినందించారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ



పరిశీలిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కుభీర్: మండలకేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం రాత్రిచోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి నగదు, తులం అమ్మవారి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారని ఆలయకమిటీ చైర్మన్ కరకాగౌడ్ తెలిపారు. ఈ విషయమై పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

'ప్రత్యేక' పాలన

- ఫిబ్రవరి1తో ముగియనున్న సర్పంచుల పదవీ కాలం
- రిజర్వేషన్లపై సందిగ్ధం



హాజీపూర్ పంచాయతీ కార్యాలయం

నెన్నెల: స్థానికసంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి 1తో ముగియనుంది. ఇప్పటికి రాష్ట్రప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలపలేదు. దీంతో ఎన్నికలు నిర్దేశిత గడువులోపు జరగవని, ప్రత్యేక అధికారుల పాలన తప్పనిసరని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ప్రత్యేక అధికారుల నియామకానికి సంబంధించిన కసరత్తును పూర్తిచేసేందుకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమజ్ఞమయ్యారు. ఇందులో భాగంగానే మండలస్థాయి అధికారుల సమాచారం సేకరిస్తున్నారు.

పర్సన్ ఇన్‌చార్జిలకు అవకాశం లేని కొత్త చట్టం..

నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నిర్దేశిత గడువులోపు ఎన్నికలు నిర్వహించాల్సిందే. లేదంటే ప్రత్యేక అధికారులు నియమించి పల్లె పాలనను కొనసాగించాల్సి ఉంటుంది. పదవీకాలం పూర్తయిన తదనంతరం ఆయా పాలకవర్గాలను పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించేందుకు కొత్త చట్టం అనుమతించడం లేదు. అలా వారిని నియమించాలంటే అసెంబ్లీలో చట్టసవరణ లేదా ఆర్డినెన్స్‌ను తేవాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనకే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.

రిజర్వేషన్లపై సందిగ్ధం..

పదేళ్ల పాటు రిజర్వేషన్లు ఉండేలా నూతన పంచాయతీరాజ్ చట్టంలో పొందపర్చారు. 2018లో ఎన్నికలు నిర్వహించిన సమయంలో నిర్దేశించిన రిజర్వేషన్‌లు పదేళ్ల పాటు అమలులో ఉంటాయని వెల్లడించారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లు పెంచుతామని ఎన్నికల హామీలో ప్రకటించింది. బీసీ గణన చేపట్టి ఆయా గణంకాల ఆధారంగా రిజర్వేషన్లు నిర్ధారిస్తామని వెల్లడించింది. పంచాయతీల సంఖ్య పెరిగిన నేపథ్యంలో రిజర్వేషన్ల మార్పు తప్పనిసరిగా కనిపిస్తుంది. ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అప్పటివరకు సందిగ్ధత కొనసాగుతుంది.

జిల్లాలు	పంచాయతీలు
మంచిర్యాల	311
కుమురం భీం	335
ఆదిలాబాద్	468
నిర్మల్	396

మండల స్థాయి అధికారులతో..

గ్రామ పంచాయతీలకు మండల స్థాయి అధికారులను నియమించనున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యం లేని శాఖలకు చెందిన అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించాలనే ఆలోచనలో జిల్లా యంత్రాంగం ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మండల పరిషత్‌లోని సూపరింటెండెంట్, ఎంపీవో, వ్యవసాయాధికారులు, పశు వైద్యాధికారులు, ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన ఏఈలను నియమించనున్నారు. మేజర్ పంచాయతీలకు జిల్లాస్థాయి అధికారులను నియమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

సార్వత్రిక ఎన్నికల తర్వాతే పల్లెపోరు

రాష్ట్రంలో అధికారంలో చేపట్టిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పనిచేస్తోంది. మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంది. ఆరు గ్యారంటీల అమలుకు దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈనెల 20వ తేదీ నుంచి ఇంటింటా సర్వే చేపట్టి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తుల ఆధారంగా అర్హులను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మే నెలాఖరులోగా పూర్తిచేసిన తర్వాతే జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఏక కాలంలో నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

ప్రాణంపెట్టి.. ప్రతిమను మలచి

- బాలరాముని ప్రాణప్రతిష్ఠ రోజే మూలవిరాట్ రూపకల్పన
- 12 గంటల్లో మట్టిశిల్పాన్ని తీర్చిదిద్దిన కళాకారుడు భీమేష్



బాలరాముని విగ్రహంతో పోలీస్ భీమేష్

నిర్మల్‌ఖిల్లా: అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం కొనసాగుతుండగానే భక్తి తన్మయత్వంతో అప్పటికప్పుడే మూలవిరాట్ పోలిన శిల్పాన్ని తీర్చిదిద్దాలని సంకల్పించాడు ఆ యువకుడు. అనుకున్నదే తడవుగా దాదాపు 12 గంటల పాటు శ్రమించి మట్టిశిల్పాన్ని జీవకళ ఉట్టిపడేలా తీర్చిదిద్దాడు. నిర్మల్ మండలం అనంతపేట్‌కు చెందిన యువ కళాకారుడు పోలీస్ భీమేష్ సాధారణ బంక మట్టితోనే అద్భుతమైన బాలరాముడి విగ్రహాన్ని చూడచక్కని రూపంలో రూపొందించాడు. సాయంత్రానికల్లా తుది మెరుగులు దిద్దాడు. చెరువుమట్టితో అద్భుతమైన కళాఖండం రూపొందింది. నుదుట తిలకం, చూడచక్కని ముఖ వర్చస్సు, తలపై భాగంనుంచి మెడ వరకు కేశాలు, శిరస్సు భాగాలన్నీ కేవలం చేతితోనే అందమైన ఆకృతిలో మలచడం విశేషం. కేవలం చెరువులోని బంకమట్టి, ఒకటి రెండు సహజరంగులు ఉపయోగించినట్లు పేర్కొంటున్నాడు. బాలరాముని నమూన ప్రతిమ పలువురిని విశేషంగా ఆకట్టుకుంటోంది.

బియ్యం గింజలతో శ్రీరాముని చిత్రం



సురేఖకు రాముని చిత్రపటాన్ని అందిస్తున్న శిరీష

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఎమ్మెస్సీ జువాలజీ చదువుతున్న శానగొండ శిరీష బియ్యం గింజలతో శ్రీరాముని చిత్రపటాన్ని తయారు చేసి సోమవారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖకు బహుమతిగా అందించారు. అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మంచిర్యాలలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఆయన సతీమణి సురేఖ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఈ చిత్రపటాన్ని అందించడం ఆనందంగా ఉందని శిరీష తెలిపారు.

సైకిల్‌పై అయోధ్యకు



సచిన్‌కు పూలమాల వేస్తున్న గ్రామస్తులు

తిర్యాణి: మండలంలోని ఎదులపహాడ్‌కు చెందిన ఆత్రం సచిన్ సైకిల్‌పై అయోధ్యకు బయల్దేరి వెళ్లాడు. అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ పురస్కరించుకుని సోమవారం తన సైకిల్ యాత్రను ప్రారంభించాడు. గ్రామస్తులు సచిన్‌కు రూ.10 వేలు విరాళంగా అందజేశారు.

మహాపూజకు నువ్వుల నూనె తయారు



నీ ఘూనా యంత్రం



చిత్తగూడలో నువ్వుల నూనె తయారు చేస్తున్న గిరిజనులు

నార్నూర్: మండల కేంద్రంలో ఈనెల 25న జరిగే ఖందేవ్ మహాపూజకు ఆదివాసీ గిరిజనులైన తొడసం వంశస్తులు సిద్ధమవుతున్నారు. ప్రతిఏడాది జనవరి నెల పుష్యమాసంలో వారు తరలివచ్చి పూజ చేస్తారు. వారి సంస్కృతి సంప్రదాయం ప్రకారం తొడసం వంశానికి చెందిన ఆడపడుచు 3 కిలోల నువ్వుల నూనె తాగి మొక్కు చెల్లించడం ఆనవాయతీ. చిత్తగూడ, మాన్కాపూర్ గ్రామంలో నీ ఘూనా (నూనె తయారు చేసే యంత్రం) ద్వారా నూనెను తయారు చేశారు. పుష్యమాసం ప్రారంభంలో చంద్రుడు కనిపించిన తర్వాత నియమ నిష్ఠలతో ఖందేవుని సన్నిధిలో తొడసం వంశానికి చెందిన ఆడపడుచు మూడేళ్లకోసారి ఒకరు నూనె తాగి మొక్కు తీర్చుకుంటారని ఆలయ కమిటీ సభ్యుడు తొడసం నాగోరావు తెలిపారు.

మతసామరస్యం చాటిన హుస్సేన్..!

కుంటాల: అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని కల్లూర్ పడమరముఖి హనుమాన్ ఆలయంలో భజన కార్యక్రమం నిర్వహించారు. నర్సాపూర్(జి) మండలం చాక్‌పెల్లికి చెందిన హుస్సేన్ సోమవారం భజన కార్యక్రమంలో పాల్గొని మతసామరస్యాన్ని చాటాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయన్ను సన్మానించారు.

ప్రమాదవశాత్తు మిల్లర్‌లో చేయిపడి..

ముథోల్: ఇంటిపై స్లాబ్ వేయడానికి పనిచేస్తుండగా, ఓ వ్యక్తి మిల్లర్‌లో ప్రమాదవశాత్తు చేయిపడి తెగింది. మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా రత్నాలికి చెందిన యువకుడు లక్ష్మణ్ (30) పని నిమిత్తం ముథోల్‌కు వచ్చాడు. సోమవారం కోలిగల్లీలో ఓ ఇంటిపై స్లాబ్ వేయడానికి పనిచేస్తున్నాడు. అనంతరం మిలర్‌ను కడుగుతుండగా ప్రమాదవశాత్తు లక్ష్మణ్ చేయి రావడంతో నుజ్జునుజ్జయి తెగిపడిపోయింది. స్థానికులు అతన్ని అంబులెన్సులో నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు.

రిలోకేషన్ సైట్ పరిశీలించిన ఎఫ్‌డీపీటీ



వ్యవసాయ భూమిని పరిశీలిస్తున్న ఎఫ్‌డీపీటీ

కడెం: మండలంలోని రాంపూర్, మైసంపేట్ గ్రామస్తులకు ఏర్పాటు చేస్తున్న రిలోకేషన్ సైట్‌ను సోమవారం ఎఫ్‌డీపీటీ శాంతరామ్ పరిశీలించారు. కొత్త మద్దిపడగ సమీపంలోని పునరావాస కాలనీలో పనులు, పెత్తర్పు సమీపంలోని వ్యవసాయ భూములను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. భూముల హద్దుల ఏర్పాటు పనులు పూర్తి చేయాలని అటవీ అధికారులను ఆదేశించారు. డీఎ ఫ్‌వో రాంకిషన్, ఎఫ్‌డీవో భవానిశంకర్, ఎఫ్ఆర్వో అనిత, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డీఆర్వోలు సిద్దార్థ, ప్రకాశ్ ఉన్నారు.

బోర్‌వెల్ లారీబోల్తా

- అతివేగంతో డివైడర్‌ను ఢీకొట్టగా ప్రమాదం
- రెబ్బెన మండలం కైరిగాం వద్ద జాతీయ రహదారిపై ఘటన
- ఒకరి మృతి, పలువురికి తీవ్ర గాయాలు



బోల్తాపడిన బోర్‌వెల్ లారీ



ధీరన్ మృతదేహం

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం కైరిగాం వద్ద బోర్‌వెల్ లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కూలీ ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమం, మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. ఆసిఫాబాద్‌కు చెందిన తిరుమల బోర్‌వెల్స్‌కు చెందిన బోర్‌వెల్ లారీ సోమవారం రాత్రి కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వైపు నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తోంది. మార్గమధ్యలో ఉన్న కైరిగాం వద్ద జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తగా వాహనాన్ని నడపటంతో అదుపు తప్పి కుడివైపున డివైడర్‌ను ఢీకొట్టింది. వాహనంలో ఉన్న కలకత్తాకు చెందిన కూలీ ధీరన్ (40) అక్కడిక్కడే మృతి చెందగా, గుడిహత్నూర్‌కు చెందిన డ్రైవర్ చిత్రుతోపాటు కలకత్తాకు చెందిన కూలీలు అరవింద్, ఆనంద్, సమీర్ లాల్, లాల్ చంద్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ ఘటన స్థలానికి చేరుకుని జిత్రు, అరవింద్, ఆనంద్‌లను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, సమీర్‌లాల్, లాల్ చంద్‌లను ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ చిత్రు పరిస్థితి విషమంగా ఉంది. లారీ బోల్తాపడటంతో ఆసిఫాబాద్ వైపు నుంచి రెబ్బెన వైపు వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నేషనల్ హైవే సిబ్బంది సహకారంతో ఎస్సై.. లారీని క్రేన్ సహాయంతో తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

యువకుడు ఆత్మహత్య



సాయినాథ్ మృతదేహం

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామానికి చెందిన యువకుడు పసువుల సాయినాథ్(24) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. సాయినాథ్ గతకొన్నేళ్లుగా స్కిన్ ఎలర్జీతో బాధపడుతున్నాడు. నొప్పి భరించలేక మద్యానికి అలవాటుపడ్డాడు. స్కిన్ ఎలర్జీతో శరీరమంతా పొక్కులు వచ్చేవి. ఈ బాధ భరించలేకనే శనివారం ఇంటి నుంచి వెళ్లి గుండేగాం సమీపంలోని వంతెన వద్ద బ్యాక్‌వాటర్‌లో దూకాడు. ఆదివారం మృతుడికి సంబంధించిన బట్టలు కనిపించగా వెతికినా మృతదేహం లభ్యం కాలేదు. సోమవారం గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడికి వివాహం కాలేదు. తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి ఒకరు ఆత్మహత్య



రామకృష్ణ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మద్యానికి బానిసై ఒకరు చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని పోచమ్మగల్లీకి చెందిన దాతుర్క రామకృష్ణ (46), శ్రీలత భార్యభర్తలు. ఈ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. రామకృష్ణ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గత కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఇంటికి తాగి వచ్చి భార్యతో గొడవపడేవాడు. శనివారం భార్యతో గొడవపడి మనస్తాపంతో ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. సోమవారం గంగన్నపేట చెరువులో శవమై తేలడంతో చేపలవేటకు వెళ్లిన వారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

జైనథ్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన సట్ల వెంకన్న(52)కు చెందిన 8 ఎకరాల వ్యవసాయ భూమి 40 ఏళ్ల క్రితం సాత్నాల ప్రాజెక్ట్‌లో పోయింది. అప్పటినుంచి ఇప్పటివరకు ఎలాంటి పరిహారం రాలేదు. దీంతో ఆయన ఏళ్లుగా పరిహారం వస్తుందో రాదోనని దిగులు చెందుతున్నాడు. ఈక్రమంలో సోమవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉంది. భార్య వెంకటమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షాపూర్ ప్రాంతంలోని చేపల మార్కెట్ ప్రాంతంలో పేకాటస్థావరంపై వన్‌టౌన్ పోలీసులు సోమవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్టుచేశారు. వారినుంచి రూ.39 వేల నగదు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ, ఎస్సై హబీబ్ ఖాన్ తెలిపారు.